
సాక్షి
బాపట్ల
శనివారం । 20 । మే । 2023



వేసవి విజ్ఞాన శిబిరం

గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం జరిగింది. శుక్రవారం విద్యార్థులకు ఆంగ్ల భాషపై అవగాహన కల్పించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 521.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి విడుదలవుతున్న నీటిని పూర్తిగా నిలిపివేశారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,800, గరిష్ట ధర రూ.3,200, మోడల్ ధర రూ.2,400 వరకు పలికింది.

న్యూస్‌రీల్

పురపాలక సంఘం ప్రత్యేక అధికారిగా లక్ష్మీశివజ్యోతి



బాపట్లఅర్బన్: బాపట్ల పురపాలక సంఘం ప్రత్యేక అధికారిగా బాపట్ల జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీశివ జ్యోతిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో లక్ష్మీశివ జ్యోతిని ప్రభుత్వం నియమించింది. ఆమెకు బాపట్ల మునిసిపాలిటీ కమిషనర్, సిబ్బంది శుభకాంక్షలు తెలిపారు.

పల్నాడుకు ఇద్దరు ఏఎస్పీలు



ఆర్.రాఘవేంద్ర, ఏఎస్పీ

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం పల్నాడు జిల్లాకు ఇద్దరు అదనపు ఎస్పీలును నియమించింది. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు డీఎస్పీలకు ఇటీవలే జిల్లా అదనపు ఎస్పీలుగా పదోన్నతులు కల్పించింది. వారితో పాటు ఇప్పటికే పనిచేస్తున్న పలువురు అదనపు ఎస్పీలకు శుక్రవారం వివిధ ప్రదేశాల్లో కొత్త నియామకాలు ఇస్తూ రాష్ట్ర హోంశాఖ ఉత్తర్వులను జారీ చేసింది. ఆర్.రాఘవేంద్రను పల్నాడు జిల్లా ఏఎస్పీ (అడ్మిన్)గా నియమిస్తూ ఆదేశాలిచ్చింది. 2011 ఐపీఎస్ క్యాడర్‌కు చెందిన ఆర్.రాఘవేంద్ర రాయలసీమ ప్రాంతంలో సుదీర్ఘకాలం పని చేశారు. చివరగా కడప జిల్లా ఇంటిలిజెన్స్ డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. రాఘవేంద్ర స్వగ్రామం అనంతపురం జిల్లా మడకశిర నియోజకవర్గం కురుబురపల్లి. పదోన్నతిపై పల్నాడు జిల్లాకు వస్తున్నారు. అలాగే వెయిటింగ్‌లో ఉన్న డీఎస్పీ ఎస్‌కే చంద్రశేఖర్‌ను పల్నాడుజిల్లా ఏఎస్పీ(నేరవిభాగం)గా నియమిస్తూ హోంశాఖ ఉత్తర్వులిచ్చింది. వీరిద్దరూ త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు.

గుంటూరు ఏఎస్పీ (ఎల్‌అండ్‌ఓ)గా శ్రీనివాసరావు

నగరంపాలెం(గుంటూరు): గుంటూరు జిల్లా ఏఎస్పీ (లా అండ్ ఆర్డర్)గా కె.శ్రీనివాసరావు నియమితులయ్యారు. శుక్రవారం పలువురు ఏఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఏఎస్పీగా వెయింటింగ్‌లో ఉన్న ఆయన గుంటూరుకు బదిలీయ్యారు. ఇప్పటి వరకు ఏఎస్పీగా కొనసాగిన పి.అనీల్‌కుమార్‌ను ఏసీబీ కేంద్ర కార్యాలయానికి బదిలీ చేయగా, అటాచ్‌మెంట్‌పై అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏఎస్పీగా నియమించారు.

రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా ఈశ్వరరావు

నగరంపాలెం(గుంటూరు): రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా కె.ఈశ్వరరావు నియమితులయ్యారు. శుక్రవారం పలువురు అడిషనల్ ఎస్పీ (ఏఎస్పీ)లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీసింది. ప్రస్తుతం గవర్నర్ ఇన్ రాజ్‌భవన్ ఏడీసీగా విధులు నిర్వహిస్తున్న ఈశ్వరరావును గుంటూరుకు బదిలీ చేశారు. ఈయన 2010 బ్యాచ్ గ్రూప్–1 అధికారి. గతంలో ఏలూరులో అడ్మిన్ ఏఎస్పీగా, గుంటూరు అర్బన్ (ఎల్‌అండ్‌ఓ) ఏఎస్పీగా విధులు నిర్వర్తించారు.

ఎనిమిది మందితో దుర్గగుడి వైదిక కమిటీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి ఎనిమిది మందితో కూడిన వైదిక కమిటీని ఏర్పాటు చేస్తూ ఆలయ ఈవో భ్రమరాంబ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైదిక కమిటీలో స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వేద పండితులు వి.శ్యామశ్వ మహర్షి, యూవీఎల్ఎన్ సుబ్రహ్మణ్య ఘనాపాటి, ప్రధాన అర్చకుడు లింగంబోట్ల బద్రీనాథ్ బాబు, ఉప ప్రధాన అర్చకుడు బి. శంకర్ శాండిల్య, ముఖ్య అర్చకుడు యజ్ఞనారాయణ శర్మ, అర్చకుడు యూవీఎస్ మురళీధర్ శాస్త్రి, పీవీ రఘునాథ శర్మలను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. వైదిక కమిటీ సభ్యులు ప్రతి రోజు నిర్వహించే విధులతో పాటు దేవస్థానం, ఉపాలయాల్లో జరిగే నిత్య, వార్షిక వైదిక కార్యక్రమాలు, వార్షిక పండుగలు ఆగమ శాస్త్రం ప్రకారం నిర్వహించేలా బాధ్యత వహిస్తుంది.

ఆవు కడుపు నుంచి 40 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

మచిలీపట్నంటౌన్: కడుపులో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి ఆహారం తీసుకోకుండా, నీరు తాగకుండా అనారోగ్యం పాలైన ఓ ఆవుకు కృష్ణాజిల్లా బందరు మండల పశువైద్యాధికారి పి.దీపక్ శుక్రవారం శస్త్రచికిత్స చేశారు. ఆవు కడుపులో పేరుకుపోయిన 40 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను ఆయన తొలగించారు. చిలకలపూడికి చెందిన పుట్టి మురారి తన ఆవు పది రోజుల నుంచి ఆహారం తినకపోవటం, నీరు తాగకపోవటంతో పశువైద్యాధికారి దీపక్‌ను ఆశ్రయించారు. దీంతో ఆయన ఆవును పరిశీలించి శస్త్రచికిత్స చేసి వ్యర్థాలను తొలగించారు.

సేవా స్ఫూర్తితో పనిచేయాలి

- కలెక్టర్ రంజిత్‌బాషా
- వలంటీర్లకు పురస్కారాలు ప్రదానం



వలంటీర్లను సన్మానిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్సీ పోతుల సునీత

బాపట్లఅర్బన్: గ్రామ, వార్డు వలంటీర్లు సేవా స్ఫూర్తితో పనిచేయాలని, ప్రతి ప్రభుత్వ పథకాన్ని ప్రజలకు చేరవేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా పేర్కొన్నారు. వలంటీర్ల అవార్డుల ప్రదానోత్సవం శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమాన్ని జిల్లాలో తిలకించేలా ప్రత్యక్ష ప్రసారానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. సీఎం ప్రసంగం ముగిసిన అనంతరం జిల్లాలోని 25 మంది వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవావజ్ర పురస్కారాలను జిల్లా కలెక్టర్ రంజితబాషా, ఎమ్మెల్సీ పోతుల సునీత, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తిలు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు, వలంటీర్లు మంచి సేవలు అందించాలన్నారు. కోవిడ్ సమయంలో వలంటీర్లు అందించిన సేవలు ప్రపంచవ్యాప్తంగా మరింత ప్రాచుర్యం పొందాయన్నారు. ప్రతి ప్రభుత్వ పథకాన్ని అర్హులైన పేదలందరికి చేరవేయాలన్నారు. మంచి సేవలు అందించిన వలంటీర్లకు సేవారత్న, సేవా మిత్ర, సేవా వజ్ర పురస్కారాలతో సన్మానించడం అభినందనీయమన్నారు. ఉన్నతమైన ప్రమాణాలు పాటిస్తూ సేవల్లో మంచి పేరు సంపాదించుకోవాలన్నారు. జిల్లాలో 7,511 మందికి సేవా మిత్ర పురస్కారాలతోపాటు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.7.51కోట్లు నగదును బహుమతిగా ఇస్తున్నట్లు తెలిపారు. 145 మందికి సేవా రత్న పురస్కారాలు, రూ.20 వేలు చొప్పున మొత్తం రూ.29 లక్షలు అందిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 30 మందికి సేవా వజ్ర పురస్కారాలతోపాటు రూ.30వేలు చొప్పున రూ.9 లక్షల నగదు ఇస్తున్నామని చెప్పారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 7,686 మందికి పురస్కారాలు లభించాయన్నారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ గాంధీజీ కలలు గన్న గ్రామస్వరాజ్యం నేడు అమలులోకి వచ్చిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను మారుమూల గ్రామాలలోని నిరుపేదలకు సైతం అందించడానికి వలంటీర్ల వ్యవస్థను ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టారన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మంచి సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. ఆరోగ్యశ్రీ, నవరత్నాల పథకాలు ప్రజలకు చేరువయ్యేలా వలంటీర్లు చేస్తున్న సేవా కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రజలందరికి సంక్షేమ ఫలాలు అందించే బాధ్యతను వలంటీర్లు అదృష్టంగా భావించాలన్నారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో వలంటీర్లు చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివన్నారు. వలంటీర్లకు ఏదైనా సమస్య వస్తే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వలంటీర్లకు అండగా ఉంటామని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టరు సీహెచ్.శ్రీధర్, సీపీఓ జి.భరత్, వివిధ శాఖల అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

10లోగా కాలువల పనులు పూర్తికి ప్రణాళికలు



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా, పక్కన జేసీ సీహెచ్ శ్రీధర్

బాపట్లఅర్బన్: జిల్లాలో సాగునీటి, మురుగు నీటి కాలువల అభివృద్ధి పనులు జూన్ 10లోగా పూర్తి చేయడానికి ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సాగుకు నీరు విడుదల చేసే సమయంలో కాలువ పనులు పూర్తి చేయడానికి పక్కా ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని ఇరిగేషన్ అధికారులకు చెప్పారు. జిల్లాలో అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటల నమోదు పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. జిల్లాలో ఈకేవైసీ 16శాతం పెండింగ్ ఉందని వెంటనే నూరుశాతం పూర్తి చేయాలన్నారు. జిల్లాలో నాబార్డు బ్యాంక్ ద్వారా అందించే వ్యవసాయ రుణాలను వినియోగించుకోవాలన్నారు. రైతులకు భూసారానికి ఉపయోగించే నవధాన్యాలను కలెక్టర్ పంపిణీ చేశారు. అనంతరం మత్స్యశాఖకు సంబంధించిన మొబైల్ ఆక్వా ల్యాబ్‌ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దశరథ మహారాజు, జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, వ్యవసాయశాఖ జేడీ అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, మత్స్య శాఖ జేడీ సురేష్, ఉద్యాన శాఖ ఏడీ జెనెమ్మ, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల జగన్‌తోనే నెరవేరుతుంది

- చంద్రబాబు వ్యాఖ్యలు క్షమించరానివి
- సంక్షేమ పథకాలు అమలుపై బహిరంగ చర్చకు సిద్ధమా
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు

రేపల్లె రూరల్: భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పేదల సొంత ఇంటి కల నిజం చేసిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాజ్యసభ సభ్యుడు, బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. రేపల్లె పట్టణ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా రాష్ట్రవ్యాప్తంగా 36లక్షల మంది నిరుపేదలకు స్థలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దేనన్నారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతున్నా పేదవాడికి సొంత ఇంటి కల నెరవేరాలని బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది జగన్ అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా చేసిన 14సంవత్సరాల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా కనీసం ఆరు సెంట్లు అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. రాజధాని నిర్మాణం పేరుతో వేల ఎకరాలు పేదల నుంచి దోచుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. నేడు రాజధాని ప్రాంతంలో 51,396 మందికి ఆ భూములను ఇవ్వడానికి జగన్ శ్రీకారం చుట్టారన్నారు. దానిని అడ్డుకునేందుకు చంద్రబాబు కోర్టులను ఆశ్రయించగా న్యాయస్థానం జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయానికి మద్దతు ఇవ్వడంతో చంద్రబాబుకు మతిభ్రమించిందన్నారు. దానిని వ్యతిరేకిస్తూ చంద్రబాబు కోర్టును ఆశ్రయించినప్పటికీ న్యాయస్థానాలు సైతం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాన్ని స్వాగతించాయన్నారు. ఈ నిర్ణయాన్ని తట్టుకోలేని చంద్రబాబు ఇటీవల ఓ సభలో ఆ స్థలాలు సమాధులకైనా పనికొస్తాయని అని వ్యాఖ్యానించడం ప్రజలను అవహేళన చేయడమేనన్నారు. ఆ వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నిజాంపట్నంలో ఇటీవల జరిగిన మత్స్యకారభరోసా కార్యక్రమం విజయవంతం కావడంతో టీడీపీ మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, శాసనసభ్యుడు సత్యప్రసాద్‌లకు మతిభ్రమించిందన్నారు. టీడీపీ హయాంలో మత్స్యకారుల భృతికి 60,000 మంది లబ్ధిదారులు ఉంటే నేడు జగనన్న మత్స్యకారుల జీవన పరిస్థితులు తెలిసిన వాడిగా లక్షా 26 వేల మందికి లబ్ధిదారులను పెంచి మత్స్యకారులను ఆదుకుంటున్నారన్నారు. నాడు మీ హయాంలో రూ.2000 అందిస్తే నేడు ఒక్కొక్క కుటుంబానికి రూ.10,000 అందిస్తుంది నిజం కాదా అని అన్నారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు మా ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలపై లబ్ధిదారుల సంఖ్య, లబ్ధి వివరాలపై గణాంకాలతో తేల్చుకునేందుకు బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. ఈ సవాలును స్వీకరించే దమ్ము టీడీపీ నాయకులకు ఉందా అని ప్రశ్నించారు. లోకేష్‌బాబు ఎన్ని పాదయాత్రలు చేసినా, చంద్రబాబు ఎన్ని బహిరంగసభలు పెట్టి విచక్షణ కోల్పోయి మాట్లాడినా ప్రజలు నమ్మేపరిస్థితుల్లో లేరన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జననేత జగన్‌ను ముఖ్యమంత్రిగా ఎన్నుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

నేడు మంత్రి మేరుగ నాగార్జున పాదయాత్ర

వేమూరు: పేదలకు పంపిణీ చేస్తున్న ఇళ్ల స్థలాలపై సెంటు భూమి శవాన్ని పూడ్చి పెట్టడానికి కూడా సరిపోదని నారా చంద్రబాబు హేళనగా మాట్లాడటాన్ని నిరసిస్తూ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున శనివారం పాదయాత్ర చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు బొల్లిముంత ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం సాయంత్రం 4 గంటలకు వేమూరు దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నుంచి కొల్లూరు అనంత భోగేశ్వరస్వామి దేవస్థానం వరకు పాదయాత్ర చేస్తారని తెలిపారు. నారా చంద్రబాబు నాయుడుకి దేవుడు మంచి బుద్ధి కల్పించాలని పాదయాత్ర చేస్తున్నట్లు చెప్పారు. వేమూరు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో కదలి వచ్చి పాదయాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు.


అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదు

- కలెక్టర్ రంజిత్‌బాషా
- గృహ నిర్మాణాలపై సమీక్ష
- అమర్తలూరు ఎంపీడీఓకు షోకాజ్ నోటీసు


బాపట్లఅర్బన్: జగనన్న కాలనీలలోని పక్కా గృహాల నిర్మాణాలలో అధికారులు నిర్లిప్తత ప్రదర్శిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా హెచ్చరించారు. అభివృద్ధి కార్యక్రమాలపై డివిజన్, మండల స్థాయి అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన సమీక్షించారు. జగనన్న కాలనీలలో భూమి చదును చేసే పనులు శరవేగంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని పలు సూచనలు చేశారు. గ్రామాలలోని లబ్ధిదారులను చైతన్యపరచడంలో అధికారులు చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో 12 వేల పక్కా గృహాలు పునాది స్థాయిలోనే ఉండడంపై ఆయన ఆరా తీశారు. మండలాలు, గ్రామాల వారీగా నిర్మాణం పనులపై సమీక్షించారు. ప్రతిరోజూ ఆర్డీవోలు దిగువ స్థాయి అధికారులు, సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించాలని ఆదేశించారు. గృహ నిర్మాణ పనులు ఒక దశ నుంచి మరొక దశలోకి చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వేమూరు, అమర్తలూరు, భట్టిప్రోలు మండలాలలో పురోగతి అత్యంత తక్కువగా ఉండడంతో సంబంధిత అధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అమర్తలూరు ఎంపీడీవో గైర్హాజర్‌పై షోకాజ్ నోటీస్ జారీ చేయాలన్నారు. మోదుకూరు గ్రామం ఇంజినీరింగ్ అసిస్టెంట్ పనితీరు సరిగా లేకపోవడంతో షోకాజ్ నోటీస్ జారీ చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణంలో అధికారులు అలక్ష్యం వహించరాదని కలెక్టర్ హెచ్చరించారు. నిర్దేశించిన గడువులోగా పనులు వేగంగా చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు బిల్లులు ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి పంపాలన్నారు. నిర్మాణాలలో పురోగతి కనిపించాలని అధికారులను ఆయన ఆదేశించారు. నాడు–నేడు పనులలో పది అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రూ.13 కోట్ల నిధులు సిద్ధంగా ఉన్నందున పనులు వేగంగా చేపట్టాలన్నారు. నిధుల కొరత లేనందున విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పనుల నాణ్యతను అధికారులు పరిశీలించాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని బంధం

- ఒకేరోజు తనువు చాలించిన సీఎస్సార్ మాస్టారు దంపతులు
- గురువుకు నివాళులర్పించిన రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి



సుబ్రహ్మణ్యేశ్వరరావు (ఫైల్)



పుష్ప లీలావతి (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: అరవై ఏళ్ల వైవాహిక జీవితంలో ఎప్పుడు ఎడబాటు అనేది లేదు. ఒకరిని విడిచి, ఒకరు ఉండలేని బంధం వారిది. అందుకే ఎనిమిది పదుల వయసులో భర్త మరణాన్ని భరించలేని ఆ ఇల్లాలు పతి అంత్యక్రియలు పూర్తయిన కొదిసేపటికే తనూ తనువు చాలించింది. ఈ హృదయవిదారక ఘటన గురువారం గుంటూరులో జరిగింది. గుంటూరు నగరంలోని చౌత్రా సెంటర్లో నివసిస్తున్న చుండూరు సుబ్రహ్మణ్యేశ్వరరావు సంగడిగుంటలోని జీసీఎస్ఎస్ జూనియర్ కాలేజీ హైస్కూల్ (చలమయ్య హైస్కూల్)లో 1966 నుంచి గణిత శాస్త్ర ఉపాధ్యాయునిగా పని చేసి 1993లో ఉద్యోగ విరమణ చేశారు సీఎస్సార్ మాస్టారుగా సుపరిచితులైన ఆయన బోధనా పటిమతో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. ఆయన వద్ద చదువుకున్నవారు వివిధ రంగాల్లో ఉన్నతస్థాయిల్లో స్థిరపడ్డారు. 88 ఏళ్ల వయసులో అనారోగ్యంతో ఈనెల 18న ఉదయం గుంటూరులోని తన స్వగృహంలో ఆయన తుది శ్వాస విడిచారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఆయన భౌతికకాయానికి అదే రోజు సాయంత్రం అంత్యక్రియలు పూర్తి చేశారు. భర్త అంత్యక్రియలు పూర్తి చేసిన కొద్ది సేపటికే ఆయన సతీమణి పుష్పలీలావతి (83) భర్త వియోగాన్ని భరించలేక మానసిక వేదనతో తనవు చాలించారు. వీరికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. తల్లిదండ్రులు ఇద్దరూ ఒకే రోజున మరణించడంతో వారు తీవ్రంగా కలత చెందారు. సుబ్రహ్మణ్యేశ్వరరావు మాస్టారు వద్ద చదువుకున్న పూర్వ విద్యార్థి, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి గురువారం గురువు, శుక్రవారం ఉదయం గురుపత్నీ పుష్పలీలావతి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన తమ గురువు సుబ్రహ్మణ్యేశ్వరరావు వద్ద చదువుకున్న రోజులను, ఆయన అందించిన నిస్వార్థ సేవలను గుర్తు చేసుకున్నారు.

నేతన్నలకు సబ్సిడీ వెలుగులు

- ఇప్పటికే ఏడాదికి రూ.24వేలు అందజేత
- చేనేతలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరో కానుక
- 100 యూనిట్ల వరకు విద్యుత్ సబ్సిడీ
- జిల్లాలో 9500 మంది చేనేత కార్మికులు



మాట్లాడుతున్న దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ సురేంద్ర, ఎలక్ట్రికల్ డీఈ సూర్యప్రకాష్, (ఫైల్)

చీరాల: నూలుపోగునే నమ్ముకున్న నేతన్నలను అన్ని విధాలా ఆదుకునేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తుంది. ఇప్పటికే చేనేతలకు పెట్టుబడి సాయం కింద ప్రతి ఏడాదీ నేతన్న నేస్తం పేరుతో ఏడాదికి రూ.24 వేలు అందిస్తుండగా మరో కానుకను చేనేతలకు అందిస్తున్నారు. మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి నెలకు 100 యూనిట్లు విద్యుత్ సబ్సిడీ అందిస్తున్నారు. దీంతో చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 9500 మంది చేనేత కార్మికులు

బాపట్ల జిల్లాలో చీరాల, రేపల్లె నియోజకవర్గాల్లో ఎక్కువ మంది చేనేత కార్మికులు ఉన్నారు. చాలా మంది చేనేతలు సొంత మగ్గాలపై పనిచేస్తుండగా, మరికొంత మంది మాస్టర్ వీవర్ల వద్ద కార్మికులుగా పనిచేస్తున్నారు. జిల్లాలో మొత్తం 9500 మంది చేనేత కార్మికులు ఉన్నారు. అలానే 8286 మందికి ప్రతి ఏడాదీ 'వైఎస్సార్ నేతన్న నేస్తం' నగదు వారి బ్యాంకు అకౌంట్లలో జమ అవుతుంది. మగ్గం నేసే నేతన్నలు ముడి సరుకులు కొనుగోలు చేసేందుకు పెట్టుబడుల కోసం అప్పులు చేసి, ఆ అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ ఆత్మహత్యలను నివారించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేనేతలకు ప్రతి ఏడాదీ పెట్టుబడి సాయం కింద రూ.24 వేలు అందిస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి వారి బ్యాంకు అకౌంట్లలోనే జమ చేస్తూ దళారీ వ్యవస్థను అరికట్టారు. చేనేతలను ఆదుకునేందుకు అందిస్తున్న ఈ పథకం ద్వారా ఎంతో మంది చేనేతలు లబ్ధి పొందారు.

చేనేతలకు 100 యూనిట్లు వరకు సబ్సిడీ

జిల్లాలో చేనేత కార్మికులు అధికంగా ఉన్నారు. చేనేత పరిశ్రమ కూడా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది. అర్హులైన చేనేత కార్మికులకు 100 యూనిట్లు వరకు విద్యుత్ సబ్సిడీ అందిస్తున్నారు. మగ్గం ఉన్న ప్రతి ఒక్కరికి నెలకు 100 యూనిట్లు విద్యుత్ సబ్సిడీ అందిస్తూ సీఎం జగన్ మరోసారి పేదల పక్షపాతి అని నిరూపించుకున్నారు. ఈ విషయంపై దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర ఆధ్వర్యంలో ఇటీవల చీరాల మండలం దేవాంగపురిలో విద్యుత్‌శాఖ డీఈ, ఏఈలతో కలిసి చేనేతలతో సమావేశం నిర్వహించారు. అర్హులైన వారు దరఖాస్తులను సమీప విద్యుత్‌శాఖ కార్యాలయంలో అందిస్తే పరిశీలన అనంతరం వారికి వచ్చే విద్యుత్ బిల్లులో 100 యూనిట్ల విద్యుత్‌ను సబ్సిడీ ఇస్తారు. సబ్సిడీ పథకం వలంటరీ ద్వారా కాకుండా కార్పొరేషన్ తరుపున అందించనున్నారు కావున అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

> **100 యూనిట్ల సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి..**
>
> సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేతలకు పెట్టుబడి సాయం కింద రూ.24 వేలు ఇప్పటికే అందించారు. అంతేకాదు మరో కానుకగా 100 యూనిట్ల సబ్సిడీని సీఎం జగన్ ప్రకటించడం హర్షనీయం. ఈ పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకుని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
>
> –బీరక సురేంద్ర, దేవాంగ కార్పొరేషన్ చైర్మన్

సీఎం పర్యటనపై సమీక్ష

తాడేపల్లిరూరల్ : సీఆర్‌డీఏ పరిధిలో పేదలకు ఇస్తున్న ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయనున్న నేపథ్యంలో శుక్రవారం ఎంటీఎంసీ కార్పొరేషన్ కార్యాలయంలో సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్‌తో సీఎం పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. సమావేశం అనంతరం కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 26న పేదలకు ఇళ్లపట్టాలు పంపిణీ చేయాలని భావిస్తున్నారని, ఈ నేపథ్యంలో ఏర్పాట్లపై చర్చించేందుకు సమావేశమయ్యామని వివరించారు. సమావేశంలో గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి, సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పీ అనిల్, ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవి, తాడేపల్లి తహసీల్దార్ మర్రిరెడ్డి నాగిరెడ్డి, మంగళగిరి తహసీల్దార్ రామ్‌ప్రసాద్, మంగళగిరి నార్త్‌జోన్ డీఎస్పీ రాంబాబు, ఎంటీఎంసీ డీఈ కృష్ణారెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారులు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంగీత సద్గురువు అన్నమాచార్యుల జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

పాత గుంటూరు:బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం అన్నమయ్య కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో సంగీత సద్గురువు తాళ్ళపాక అన్నమాచార్యుల జయంతి మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. కార్యక్రమాలను టి.ఆదిత్య వాణి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సభలో ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి మాట్లాడుతూ గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో సంప్రదాయ సంగీతంతో పాటు అనేక సేవా కార్యక్రమాలను ప్రత్యేకంగా మహిళలు నిర్వహించటం అభినందనీయమన్నారు. అనంతరం అన్నమయ్య కీర్తనలతో నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీ శ్రావ్యంగా సాగింది. హేమాద్రి చంద్రకాంత్, బి. సురేష్ బాబు, ఎమ్. హరిబాబు వాయిద్య సహకారాన్ని అందించారు. కళాకారులు, అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో సాహితీ సమాఖ్య కార్యదర్శి ఎస్.వి. ఎస్.లక్ష్మీనారాయణ, ఆలయ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య పాల్గొన్నారు. సంస్థ ఉపాధ్యక్షురాలు మాధవపెద్ది మీనాక్షి , పాటిబండ్ల లలిత, డాక్టర్ రాజరాజేశ్వరి, కోశాధికారి విజయలక్ష్మి, కార్యదర్శి మంగాదేవి, ప్రధాన కార్యదర్శి ఎమ్.వై. శేషరాణి పర్యవేక్షించారు.

క్లుప్తంగా

స్మార్త వేద పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర వేద స్మార్త పాఠశాలలో 2023–24 సంవత్సరానికి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ప్రవేశం పొందగోరు విద్యార్థులు 12 ఏళ్లు నిండి ఉండాలన్నారు. కోర్సు కాలవ్యవధి 3/5 ఏళ్లు కాగా మూడేళ్లు కోర్సు పూర్తిచేసిన విద్యార్థికి రూ.25వేలు, ఐదేళ్లు కోర్సు పూర్తిచేసిన విద్యార్థికి రూ.50 వేలు ఆర్థిక సహకారం అందించబడుతుందన్నారు. ఉచిత వసతి, భోజన సౌకర్యం ఉంటుందని వివరించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ నిర్వహించే అర్చక పరీక్షకు శిక్షణను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 30 లోగా శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, గుంటూరు రోడ్, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా– 522 403. వివరాలకు 9491300312, 79899 27520 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ.. ఒకరి మృతి

సత్తెనపల్లి: ఎదుట లారీని తప్పించే క్రమంలో డివైడర్‌ను లారీ ఢీకొట్టిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని హోలీ ఫ్యామిలీ పాఠశాల ఎదుట శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. మొక్కజొన్న లోడుతో గుంటూరు నుంచి రాజస్థాన్ వెళ్తున్న లారీ పట్టణంలోని హోలీ ఫ్యామిలీ పాఠశాల ఎదుట ఎదురు వస్తున్న లారీని తప్పించే క్రమంలో ప్రహరీని బలంగా ఢీకొంది. ఈ ఘటనలో క్లీనర్‌గా పని చేస్తున్న మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని నిమ్ముచి జిల్లాకు చెందిన దామి రాకేష్(28) అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. లారీ ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

అసాంఘిక కార్యకలాపాల కట్టడికి నిఘా

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



వేటపాలెం పోలీస్‌స్టేషన్‌ని పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

వేటపాలెం: అసాంఘిక కార్యకలాపాల కట్టడికి నిఘాను పటిష్టం చేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వేటపాలెం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. స్టేషన్‌లోని గదులను పరిశీలించారు. కేసులకు సంబంధించిన ప్రాపర్టీ వివరాలు ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రారంభ దశలోనే నేరాలను అరికట్టడంలో మహిళా పోలీసుల పాత్ర కీలకమని తెలిపారు. సచివాలయ పరిధిలో జరిగే విషయాలను తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు స్టేషన్‌లో తెలపాలని ఆదేశించారు. భార్య, భర్తల మధ్య విబేధాల గురించిన సమాచారం తెలుసుకొని వారిపై నిఘా వుంచి వారి ప్రవర్తనను ఎప్పటికప్పుడు స్టేషన్‌లో తెలియజేయాల్సి ఉంటుందన్నారు. ఇలా చేయడం వల్ల నేరాలను ప్రారంభదశలోనే అడ్డుకోవచ్చన్నారు. రౌడీలు, సస్పెక్ట్‌లు, పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. మహిళలు, చిన్న పిల్లలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఒంటరి మహిళలను గుర్తించి తరచూ వారి నివాసాలను సందర్శిస్తూ ఉండాలన్నారు. గ్రామ సచివాలయ మహిళ పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తే నేరాలు సులువుగా నియంత్రించవచ్చన్నారు. స్టేషన్ పరిధిలోనే పోలీస్ సిబ్బంది వారి దత్తత గ్రామాలను వారానికి ఒకసారి కచ్చితంగా సందర్శించాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలతో మమేకమై గ్రామాల్లోకి ఎవరైనా కొత్తవ్యక్తులు వచ్చారా, వస్తేవారి వివరాలు తెలుసుకోవాలన్నారు. గంజాయి విక్రయిస్తున్న, తాగుతున్న వారి వివరాలు సేకరించాలని తెలిపారు. పేకాట, కోడిపందేలు ఇతర అసాంఘిక కార్యకలాపాల గురించిన సమాచారాన్ని తెలుసుకోవాలని తెలిపారు. వేటపాలెం కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో నిధుల గోల్‌మాల్ కేసులో కోర్టులో చార్జిషీట్ వేశామని, ఈ కేసు కోర్టు పరిధిలో ఉందన్నారు. అనంతరం స్టేషన్ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటారు. కార్యక్రమంలో చీరాల డీఎస్పీ ఎస్ ప్రసాదరావు, రూరల్ సీఐ ఏ మల్లికార్జునరావు, జిల్లా స్పెషల్ బ్రాంచి ఎస్సై ఏ శ్రీనివాస్, సీసీ హరికృష్ణ, వేటపాలెం ఎస్సై జి సురేష్, రూరల్ ఎస్సై జనార్దన్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

గుంటూరువెస్ట్: రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణయ్య తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంట కాలువల శుభ్రం చేయడానికి సంబంధించి రూ.5లక్షల లోపు పనులను రైతు సంఘాలకు కేటాయించడం హర్షణీయమన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1700 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. కావాల్సిన వారు గ్రామ, వార్డు వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు. 400 ప్యాకెట్ల మిరప విత్తనాలను అమ్మకానికి సిద్ధంగా ఉంచామని చెప్పారు. మార్క్‌ఫెడ్ ద్వారా శనగలను 504 మంది రైతుల నుంచి 1748 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు.

బడుగుల ద్రోహి చంద్రబాబు

చంద్రబాబు వ్యాఖ్యలపై కరణం వెంకటేష్ ఆధ్వర్యంలో నిరసన



ముక్కోణం పార్కు సెంటర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న వెంకటేష్

చీరాల: పేద, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి అడుగడున ఆటంకాలు సృష్టిస్తూ చంద్రబాబు నాయుడు పేదల ద్రోహిగా మారాడని వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ధ్వజమెత్తారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ముక్కోణం పార్కు సెంటర్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద అమరావతిలో పేదలకు భూ కేటాయింపులపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ధర్నా నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. వెంకటేష్ మాట్లాడుతూ అమరావతిలో పేదలు, బడుగు, బలహీనవర్గాలకు చెందిన 50 వేల మందికి ఇళ్ల స్థలాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తుంటే ఉన్నత వర్గాలు నివసించే రాజధాని ప్రాంతంలో పేదలు ఉండకూడదని సెంటు భూమిలో శవాలను కూడా పూడ్చేందుకు కూడా పనికిరాదంటూ చంద్రబాబు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. అమరావతిలో పేదలు ఉండేందుకు అర్హత లేదా, ఉన్నత వర్గాలు వారే ఉండాలా అని ప్రశ్నించారు. అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబు చేయడని, ఎవరైనా చేస్తే ఆయన చూస్తూ ఉండలేరన్నారు.

ఓడిపోతామనే భయంతో..

పార్టీలకు అతీతంగా సీఎం జగన్ 50 వేల మందికి స్థలం ఇస్తే, మరలా రాజధానిలో మనం ఓడిపోతామని చంద్రబాబు అడ్డుకునేందుకు రైతుల ముసుగులో కోర్టులో కేసులు వేసి అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. చివరికి సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని రాజధానిలో పేదలకు భూములు ఇవ్వడం వైఎస్సార్ సీపీతో పాటు పేదల విజయమన్నారు. సీఎం జగన్ పేదల విషయంలో పార్టీలకు అతీతంగా వ్యవహరిస్తారని, అది రాష్ట్ర ప్రజలకు తెలుసునన్నారు. పేద, బడుగువర్గాల వారంతా రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి పట్ల పూర్తి సంతృప్తితో ఉన్నారని, వారంతా జగనన్నకే మద్దతు ఇస్తారన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు పెద్ద మొత్తంలో సీఎం నిధులు కేటాయించారన్నారు. వాడరేవులో 417 కోట్లతో పోర్టు శంకుస్థాపన కూడా చేశారని, చీరాలలో పెద్ద ఎత్తున అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లి వైష్ణవి, ఆర్‌బీకే చైర్మన్లు కావూరి రమణారెడ్డి, పల్లపోలు శ్రీనివాసరావు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు చీమకుర్తి బాలకృష్ణ, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు సల్లూరి అనిల్, మున్సిపల్ కౌన్సిలర్లు మల్లెల లలిత, కీర్తి వెంకట్రావు, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎన్.రాజ్‌కుమార్, పార్టీ నాయకులు కోండ్రు బాబ్జి, గోలి గంగాధరరావు, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



అద్దంకి: వడదెబ్బకు ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బొమ్మనంపాడు గ్రామంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. అందిన సమాచారం మేరకు మండలంలోని బొమ్మనంపాడు గ్రామానికి చెందిన బండారు బ్రహ్మయ్య (43) గురువారం ఇంటి దగ్గర నుంచి శింగరకొండ క్షేత్రానికి నడిచి వెళ్లి తిరిగి వచ్చాడు. ఈ క్రమంలో వడదెబ్బకు గురై సొమ్మసిల్లి ఇంటి అరుగుపై పడిపోయాడు. బంధువులు గమనించి తొలుత అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరువాత మెరుగైన చికిత్స కోసం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు శుక్రవారం తెలిపారు. మృతుడికి భార్య, ఇరువురు సంతానం ఉన్నారు. మృతుడు కూలినాలీ చేసుకుని జీవించే వ్యక్తి కావడంతో మేమెలా బతకాలంటూ కుటుంబసభ్యులు రోదించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

మార్టూరు: చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపంతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని పూనూరులో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన మేకా రమేష్ (46) కార్పెంటర్‌గా పనిచేస్తూ చాలా కాలం హైదరాబాద్‌లో నివాసం ఉన్నాడు. అప్పుల పాలై గత కొంతకాలం కిందట స్వగ్రామం పూనూరుకు చేరుకున్నాడు. ఈ బాధలో రెండు నెలల కిందట రమేష్ ఆత్మహత్యాయత్నం చేయగా అప్పటినుంచి భార్య స్వగ్రామం జే.పంగులూరు మండలం రామకూరులో నివాసముంటున్నాడు. ఈ క్రమంలో గురువారం బొల్లాపల్లి ఎన్ఎస్‌పీ కాలువ సమీపంలో రమేష్ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన విషయాన్ని బంధువుల ద్వారా భార్య ఆదెమ్మ సమాచారం అందుకుంది. బంధువుల సాయంతో చిలకలూరి పేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే రమేష్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రమేష్‌కు ఇద్దరు మగ పిల్లలు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

పెళ్లి రోజు విషాదం

మేడికొండూరు: పెళ్లిరోజు విషాదం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులతో షాపింగ్ చేసేందుకు గుంటూరు వెళ్లారు. బైక్‌పై వస్తుండగా లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పేరేచర్ల గుంటూరు బ్రిడ్జి వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. ఫిరంగిపురం గ్రామానికి చెందిన పోలంకి బాలశౌరి జోసఫ్ కుమార్(32) గుంటూరులో ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఫిరంగిపురం నుంచి ద్విచక్ర వాహనంపై గుంటూరు వచ్చి పని ముగించుకుని తిరిగి వెళ్తుంటాడు. గురువారం పెళ్లిరోజు కావడంతో భార్య బి.రోజాను ద్విచక్రవాహనంపై షాపింగ్ చేసేందుకు గుంటూరు తీసుకెళ్లాడు. షాపింగ్ ముగిసిన అనంతరం భార్యను బస్సు ఎక్కించాడు. తన పనులు ముగించుకుని రాత్రి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. మార్గమధ్యంలో పేరేచర్ల గుంటూరు బ్రిడ్జి సమీపంలో వెనుకగా వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడిక్కడే జోసఫ్‌కుమార్ మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఏడునెలల బాబు ఉన్నాడు.

ఖాళీలను ప్రదర్శించాలి

గుంటూరుఎడ్యుకేషన్: ఉపాధ్యాయ ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ ఖాళీలను ప్రదర్శించి, మాన్యువల్ విధానంలో నిర్వహించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ కోరారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం సంఘ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్లస్ టూ పాఠశాలల కోసం పీజీటీ పోస్టులు, ఎంఈఓ–2 పోస్టులతో పాటు వందలాది స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేస్తున్న దృష్ట్యా ప్లేసులతో సహా కౌన్సెలింగ్ నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. మాన్యువల్ విధానంలో ఖాళీలను చూపించి కౌన్సెలింగ్ నిర్వహించడం ద్వారా ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉద్యోగోన్నతులు తీసుకునేందుకు సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి సహకరించాలని వినతి



ఏసీ పానకాలరావుకు వినతిపత్రం ఇస్తున్న కమిటీ సభ్యులు, గ్రామస్తులు

యద్దనపూడి: ఆలయం పునఃనిర్మాణానికి సహకరించాలని కోరుతూ శుక్రవారం ఆలయ డెవలప్‌మెంట్ సమితి సభ్యులు, గ్రామస్తులు జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ పానకాలరావుకు వినతిపత్రం అందించారు. మండలంలోని పోలూరు గ్రామంలో ఉన్న గంగాభ్రమరాంబ సమేత చెన్నుమల్లికార్జున స్వామి సుమారు 250 ఏళ్ల కిందట నిర్మించారు. ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరి ఆలయం మొత్తం పల్లంగా ఉండటంతో వర్షపునీరు, మురుగునీరు గర్భాలయంలోకి చేరి స్వామివారి మూలవిరాట్‌లు సైతం మునిగిపోతుండటంతో నూతన ఆలయం నిర్మించాలని గ్రామస్తులు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు సుమారు రూ.2 కోట్లతో ఆలయ పునఃనిర్మాణం చేయాలని భావించి ఈ విషయాన్ని గ్రామస్తులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లటంతో ఏసీ పానకాలరావు ఆలయాన్ని సందర్శించి ఆలయ పరిసరాలను పరిశీలించారు. గ్రామస్తులు మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ కింద రూ.30 లక్షల చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని, దేవదాయశాఖ తరఫున గ్రాంటు మంజూరు చేయాలని కోరారు. ఏసీ పానకాలరావు ఆలయ పునఃనిర్మాణానికి శాఖాపరంగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శైలేంద్ర, ఈఓ జ్యోతి, అర్చకులు నూతలపాటి లలిత్‌ప్రసాద్, మల్లికార్జునశర్మ, దుర్గానాగేంద్ర బాబు, పవన్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పర్చూరి అనంతనారాయణాచార్యులు, గడగొట్టు రాంబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చందోలు జాతీయ రహదారిపై ప్రమాదం



ప్రమాద ప్రదేశంలో మృతి చెందిన యువకుడు



తీవ్రంగా గాయపడిన ఇద్దరు యువకులు

- ఓ యువకుడు దుర్మరణం
- ఇద్దరికితీవ్ర గాయాలు

పిట్టలవానిపాలెం: అతివేగం ఒకరి ప్రాణాలు తీయగా మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పిట్టలవానిపాలెం మండలం చందోలు జాతీయ రహదారిపై అధిక వేగంతో ద్విచక్రవాహనంపై ముగ్గురు యువకులు ప్రయాణిస్తున్నారు. చందోలు శివారులోని జాతీయ రహదారి పక్కనే నూతనంగా నిర్మిస్తున్న బస్టాప్‌ను వేగంగా ఢీకొన్నారు. వీరిలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు యువకులకు తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. వీరందరిది చెరుకుపల్లి మండలం తుమ్మలపాలెం గ్రామంగా చెబుతున్నారు. మృతుడు పగడం ఇంద్రకిరణ్‌రెడ్డిగా గుర్తించారు. గాయపడ్డ వారి వివరాలు తెలియాల్సి ఉంది. చందోలు ఏఎస్ఐ దాసు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

పేదలపై టీడీపీ వైఖరి మార్చుకోవాలి



మేడికొండ సునీల్

చినగంజాం: పేదలపై టీడీపీ అధిష్టానంతోపాటు నాయకులు సైతం తమ వైఖరిని మార్చుకోవాలని బాపట్ల జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు మేడికొండ సునీల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్–5 జోన్‌లో ఈనెల 26న రాజధానిలో సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి దళిత బహుజన గిరిజనులకు 54 వేల ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంటే కడుపు మంట ఆపుకోలేని చంద్రబాబు సెంటు భూమిలో ఏమొస్తుంది శవం పూడ్చడానికి సరిపోతుందని మాట్లాడటం అతని పెత్తందారీ అహంకార ధోరణికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గతంలో అతని కుమారుడు లోకేష్ కూడా సెంటున్నర స్థలంలో నా బాత్రూం సరిపోతుందని హేళన చేశారన్నారు. ఒకే ఇంట్లో రెండు మూడు కుటుంబాలు నివాసముంటూ కూలినాలీ చేసుకొని జీవిస్తూ అద్దెలు కట్టలేని పరిస్థితులలో బడుగు బలహీన వర్గాల బతుకు వెళ్లదీస్తున్నారన్నారు. ఇప్పటికైనా తమ కుటిల రాజకీయ వైఖరిని మార్చుకోకపోతే 2019లో ఏం జరిగిందో 2024లో ఎంతమంది కలిసొచ్చినా అదే జరుగుతుందని ఆయన జోస్య చెప్పారు.

చదివేది డిగ్రీ.. చేసేది బైక్ చోరీలు

- ద్విచక్ర వాహనం చోరీ కేసులో విద్యార్థి అరెస్ట్
- 8 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



చోరీ కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ అశోక్ కుమార్, సిబ్బంది

నరసరావుపేట టౌన్: డిగ్రీ చదువుతూ చెడు వ్యసనాలకు బానిసై ద్విచక్ర వాహన దొంగతనాలకు పాల్పడుతున్న విద్యార్థిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 8 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ అశోక్ కుమార్ తెలిపారు. శుక్రవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చిలకలూరిపేట మద్దినగర్‌కు చెందిన షేక్ ఖాలీషా నరసరావుపేట పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూ ఆ కళాశాల హాస్టల్‌లో ఉంటున్నాడు. రెండు నెలల క్రితం అతని స్నేహితుడి వద్ద కారు తీసుకొని ఖాలీషా శావల్యాపురం తిరునాళ్లకు వెళ్లి తిరిగి వస్తుండగా యాక్సిడెంట్ అయింది. కారు రిపేరు చేసేందుకు రూ.50 వేలు ఖర్చు అవుతుందని వాటిని ఇవ్వాలని యజమాని ఒత్తిడి తెస్తున్నాడు. డబ్బు కోసం ఖాలీషా ద్విచక్రవాహనాల దొంగతనాల మార్గం ఎంచుకున్నాడు. ప్రతిరోజు రాత్రిళ్లు పట్టణంలో సంచరిస్తూ ద్విచక్రవాహనాలను అపహరిస్తున్నాడు. రామిరెడ్డిపేట రాధాసుందర కల్యాణ మండపం, సన్నిధి ఫంక్షన్ హాల్ వద్ద నిలిపి ఉన్న 8 ద్విచక్రవాహనాలను దొంగిలించి రైల్వే స్టేషన్ వెనుక భాగంలో ముళ్ల పొదల్లో వాటిని దాచాడు. దొంగలించిన వాహనాల్లో ఒక వాహనంపై సంచరిస్తూ శుక్రవారం ఆర్‌యూబీ వద్ద తనిఖీలు చేస్తున్న సమయంలో పట్టుబడ్డాడు. విచారణలో పై నేరాలన్ని తానే చేశానని నేరాన్ని అంగీకరించటంతో ద్విచక్రవాహనాలను అతడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.